క్లుప్తంగా

నేడు, రేపు ఉచిత వినికిడి పరీక్ష శిబిరం

నల్లగొండ టౌన్ : పట్టణంలోని శ్రావ్య స్పీచ్ హియరింగ్ సెంటర్‌లో 14వ వార్షికోత్సవం సందర్భంగా అన్ని వయస్సుల వారికి ఆదివారం, సోమవారం రెండు రోజుల పాటు ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆడియాలజిస్ట్ డాక్టర్ రమ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. వినికిడి లోపం ఉన్న వారికి ఆరోగ్యశ్రీ (తెల్లరేషన్ కార్డు) కలిగిన వారికి తక్కువ ధరలో చెవి మిషన్లు అందజేస్తామన్నారు. వివరాలకు 99669 40294ను సంప్రదించాలని కోరారు.

బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రిక అందజేత


ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మర్రిగూడ : మండలంలోని శివన్నగూడ గ్రామంలో గల శ్రీనీలకంఠ రామస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి ఆలయ కమిటీ చైర్మన్ రాపోలు యాదగిరి శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. బ్రహ్మోత్సవాలు ఈనెల 16నుంచి 26వరకు కొనసాగుతాయని, 20న కల్యాణోత్సవం, 25న రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట సభ్యులు చిట్యాల రంగారెడ్డి, ముడిగ నర్సింహాయాదవ్, నర్సింహాముదిరాజ్ ఉన్నారు.

గెస్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి


జానారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గెస్ట్ లెక్చరర్లు

రామగిరి(నల్లగొండ) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి కార్యాలయంలో, అనంతరం కుందూరు జానారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గెస్ట్ లెక్చరర్లకు 12నెలలు నెలకు రూ.50వేల వేతనం ఇవ్వాలని కోరారు. కలిసిన వారిలో గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగ్ శంకర్, జనరల్ సెక్రటరీ గోవర్ధనగిరి, సభ్యులు జి.అంజయ్య, వై.కిరణ్, వై.రుకేష్, మహేష్ పాల్గొన్నారు.

ప్రెస్ అకాడమీ చైర్మన్‌కు సన్మానం


సన్మానిస్తున్న జర్నలిస్టులు, నాయకులు

నార్కట్‌పల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మండలంలోని పల్లెపహాడ్ గ్రామానికి చెందిన కలకోలను శ్రీనివాస్‌రెడ్డిని శనివారం మండల కేంద్రంలో స్థానిక జర్నలిస్టులు, నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టులకు తనవంతు పూర్తి సహకారాన్ని అందజేస్తానని తెలిపారు. త్వరలో మండల జర్నలిస్టులకు సెమినార్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు ప్రజ్ఞాపురం శివశంకర్, ఎండీ సాదత్‌అలి, పల్లె తిరుమల్, కాంగ్రెస్ నాయకులు బండా అమృతారెడ్డి, పాటి వెంకట్‌రెడ్డి, చల్ల వాసుదేవ్ తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

శాలిగౌరారం : విద్యుత్ తీగకు తగిలి ఓ ఎద్దు మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని భైరవునిబండ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పులిచర్ల సోమయ్య తన రెండు ఎద్దులను గ్రామశివారులో మేపుతున్నాడు. ఈ క్రమంలో ఓ ఎద్దు మేత మేసుకుంటూ వెళ్లి ఆ భూమిలో తెగిపడి ఉన్న విద్యుత్ తీగను తగలడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు విలువ సుమారు రూ.60వేలకు పైగా ఉంటుందని బాధిత రైతు వాపోయాడు.

రేవంత్‌రెడ్డి ప్రకటనపై హర్షం

కేతేపల్లి : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గొర్రెల పంపిణీలో జరిగిన అవినీతిపై దర్యాప్తుకు ఆదేశిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల డీసీసీ నాయకుడు జటంగి వెంకటనర్సయ్యయాదవ్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మా ట్లాడారు. గొర్రెల కోసం గతంలో డీడీలు కట్టి గొర్రెలు రాని వారికి డబ్బులు వాపస్ వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గొర్రెల పంపిణీ పథకంలో అవినీతికి పాల్పడిన బాధ్యులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నిలువ నీడ కరువు

- బస్‌షెల్టర్లు లేక ప్రయాణికుల అవస్థలు
- బస్సుల కోసం హైవేపై ఎండలోనే పడిగాపులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు


హైవేపై ఎండలో నిలబడి బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

కట్టంగూర్ : వేసవి ప్రారంభం మార్చి మెదటి వారంలోనే భానుడు భగభగమంటున్నాడు. దీంతో హైవేపై నిలువ నీడలేక ప్రయాణికులకు ఎండలో నిలబడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రంలో జాతీయ రహదారికి ఇరువైపులా ప్రయాణికులకు అనువైన చోట జీఎంఆర్ సిబ్బంది బస్‌షెల్టర్లను నిర్మించకపోవడంతో ప్రజలు ఎండలో నిలబడే పరిస్థితి నెలకొంది. ఎండతీవ్రతతో ప్రయాణికులు హైవేపై బస్సుల కోసం నిలబడలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలో జాతీయ రహదారికి ఇరువైపులా నల్లగొండ, నకిరేకల్ బస్‌స్టాప్‌ల వద్ద బస్‌షెల్టర్‌లో లేకపోవడంతో ప్రజలు ఎండకు, వానకు తిప్పలు తప్పడం లేదు. పది సంవత్సరాలుగా జాతీయ రహదారిపై అనువైన చోట ప్రయాణికులకు బస్‌షెల్టర్ లేక ఇబ్బందులకు గురవుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. మండల కేంద్రంలోని అండర్‌పాసింగ్ సమీపంలో ఇరువైపులా బస్‌షెల్టర్ నిర్మించినా అవి నిరుపయోగంగా మారుతున్నాయి. మండలంలోని అయిటిపాముల, పామనగుండ్ల, ముత్యాలమ్మగూడెం గ్రామాల్లో హైవే పక్కనే బస్‌షెల్టర్లను జీఎంఆర్ సిబ్బంది నిర్మించకపోవడంతో ప్రయాణికులు నిలబడటానికి నీడ లేక ఇబ్బందులు పడుతున్నారు. మండల ప్రజలు నిత్యం వేలాది మంది నల్లగొండకు, హైదరాబాద్, విజయవాడకు ప్రయాణాలు సాగిస్తుంటారు, కాని వారు బస్సుల కోసం వచ్చి హైవే పక్కనే బస్‌షెల్టర్‌లు లేకపోవడంతో ఎండలో నిలబడి ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రంలోని ఈదులూరు రోడ్డు వద్ద, నల్లగొండ బస్‌స్టాప్ వద్ద బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు చిన్న పిల్లలతో వెళ్లేవారు ఎండకు అవస్థలు పడుతున్నారు. ప్రయాణికులు నిలువ నీడలేక నానా అవస్థలు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత హైవే అధికారులు స్పందించి ప్రయాణికులకు అనువైన చోట బస్‌షెల్టర్లను నిర్మించి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బస్‌షెల్టర్లు నిర్మించాలి



"మండల ప్రజలు నిత్యం పలు పనుల మీద హైదరాబాద్, విజయవాడ, నల్లగొండకు వెళ్లేందుకు కట్టంగూర్ హైవేపై ఉన్న బస్‌స్టాప్‌ల వద్దకు వస్తారు. నిత్యం రద్దీగా ఉండే బస్‌స్టాప్‌ల వద్ద బస్‌షెల్టర్లు లేకపోవడంతో ఎండలో నిలబడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కట్టంగూర్‌లో నిర్మించిన బస్‌షెల్టర్ వద్ద మూత్రశాలలు లేక మహిళా ప్రయాణికులకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులకు అనువైన చోట బస్‌షెల్టర్లను నిర్మించాలి. పంచాయతీ అధికారులు ఈదులూరు మూల మలుపు వద్ద మూత్రశాలలు ఏర్పాటు చేసి నీటి సౌకర్యం కల్పించాలి.

– బి.యాదయ్య, కట్టంగూర్

ఛాయా సోమేశ్వర ఆలయంలో తెప్పోత్సవం


స్వామి వారిని ఊరేగింపుగా తీసుకొస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి, ఆలయ చైర్మన్ అనంతరెడ్డి

రామగిరి (నల్లగొండ) : మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలలో గల పానగల్లులోని ఛాయా సోమేశ్వర ఆలయం కోనేరులో శనివారం తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి ఆధ్వర్యంలో వేదపాఠశాల పండితుల మంత్రాలతో స్వామివారి తెప్పోత్సవం నిర్వహించారు. అనంతరం హైదరాబాద్ వింజమూరి లక్ష్మి బృందం ఆధ్వర్యంలో సంగీత కచేరి నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌శర్మ, కృష్ణమోహన్, హరిబాబు, సోమశేఖర్‌గౌడ్, వెంకట్, శేఖర్‌రెడ్డి, భరత్‌రెడ్డి, రవి, అర్చకులు ఉదయ్‌కుమార్, అజయ్‌కుమార్ ఉన్నారు.

ఆలయంలో అగ్నిగుండాలు

మహాశివరాత్రి సందర్భంగా జిల్లా కేంద్రంలోని పానగల్లులో గల ఛాయా సోమేశ్వర ఆలయం ఆవరణలో శనివారం ఉదయం అగ్నిగుండాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి అమ్మవార్ల పల్లకిని మోస్తూ అగ్ని గుండాలపై నడిచారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, ఆలయ మేనేజర్ యాదగిరి, భరత్‌రెడ్డి, శ్రీనివాస్‌శర్మ, మధు, దశరథ, హరిబాబు, సోమశేఖర్‌గౌడ్, వెంకట్, శేఖర్‌రెడ్డి, రుద్రసేన వలంటీర్స్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నకిరేకల్ : పట్టణంలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ కాలనీలకు ఆదివారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ సాయిగణేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వీటీ కాలనీ, కాటమయ్యబజార్, రహ్మత్‌నగర్, చీమలగడ్డ, పటేల్‌నగర్, సంతోష్‌నగర్, మూసీరోడ్డు, డాక్టర్స్‌కాలనీ, తాటికల్ రోడ్డు, మున్సిపల్ కార్యాలయం వీధి, రఘురామ థియేటర్ ఏరియా, సూర్యానగర్ కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు, అందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను హైదరాబాద్‌లో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, టీచర్లకు, ఆయాలకు గతంలో ఎన్నడూ లేని విధంగా మొదటి వారంలో జీతాలు చెల్లించామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు జొన్నలగడ్డ వెంకటరమణ, కార్యదర్శి మజ్జిగపు సునీత, నకిరేకల్ ప్రాజెక్ట్ కార్యదర్శి ఉప్పల సునీత, ఆశవర్కర్ల ప్రెసిడెంట్ శైలజ, కార్యదర్శి దేవిక, టీఎన్జీవోస్ రాష్ట్ర కార్యదర్శి మాధవి, రమాదేవి, రమ్యసుధ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలకు తపస్ కృషి



సమావేశంలో మాట్లాడుతున్న లతాకుమారి

నల్లగొండ : భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు తపస్ కృషి చేస్తుందని టీపీయూఎస్ మహిళా కన్వీనర్ లతాకుమారి అన్నారు. శనివారం పట్టణంలోని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా కార్యాలయంలో జరిగిన మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారని అన్నారు. ప్రపంచ దేశాల్లో భారతీయ మహిళలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. భారతీయ ధర్మాలు మహిళలను గొప్పగా కీర్తించాయన్నారు. అనంతరం పలువురు మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో సిందూర, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.జ్యోతి, జిల్లా అధ్యక్షుడు ఇరుగు శ్రీరామ్, సరిత, తులసి, మమత, నీరజ, సువర్ణ, రేణుక, డి.వెంకట్‌రెడ్డి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ మహిళా ఉద్యోగులకు సన్మానం


మహిళలను సన్మానిస్తున్న నాయకులు

నల్లగొండ టూటౌన్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవన్‌లో శనివారం రిటైర్డ్ మహిళా ఉద్యోగులను సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు జి.వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హెల్త్‌కార్డులు అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో చెల్లుబాటు అయ్యేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గజవెల్లి సత్యం, యాదవాసుదేవ్, రంగయ్య, ఆంజనేయులు, ముత్యాలు, నీరజ, చంద్రకళ, విజయలక్ష్మి, కృష్ణయ్య, రామలింగయ్య, కేశవాచారి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ ఏరియర్స్, డీఏలు చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య

నకిరేకల్ : ఉపాధ్యాయులకు సంబంధించిన పీఆర్‌సీ ఏరియర్స్, పెండింగ్ డీఏలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య అన్నారు. శనివారం పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో డీటీఎఫ్ జోనల్ ముఖ్య ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ మార్చితో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున పీఆర్‌సీ ఏరియర్స్, పెండింగ్ డీఏలను చెల్లించకుంటే ఆ బిల్లులన్నీ రద్దయి, తిరిగి మళ్లీ బిల్లులు చేయాల్సిన పరిస్థితులు వస్తాయన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.వెంకటేషం అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ ఖుర్షీదు మీయా, వెంకులు, జిల్లా ప్రతినిధులు నాగయ్య, వెంకటేశ్వర్లు, విద్యాసాగర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఆయా మండలాల శాఖల బాధ్యులు యాకుబ్, నర్సింహాచారి, నగేష్, సైదులు, భూపాల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవు


రికార్డును పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసరెడ్డి

శాలిగౌరారం : మండల సరిహద్దులో ఉన్న మూసీనది నుంచి ఇసుకను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని శాలిగౌరారం(నకిరేకల్ రూరల్) సీఐ శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా మూసీనది వెంట ఉన్న ప్రధాన గ్రామాల్లో పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేసి అక్రమ రవాణాను పూర్తిగా నిరోధించామన్నారు. సర్కిల్ పరిధిలో నేరాల నమోదు తగ్గిందని నేరరహిత సర్కిల్‌గా తీర్చిదిద్దే కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ ఐలయ్య, సిబ్బంది ఉన్నారు.

బహుమతులు అందజేత


బహుమతులు అందజేస్తున్న యూత్ సభ్యులు

కనగల్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని జి యడవల్లి గ్రామంలో నెహ్రూ యువ కేంద్రం నల్లగొండ వారి సౌజన్యంతో యడవల్లి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలకు పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు ఊరుగుండ్ల విజయ్ మాట్లాడారు. కార్యక్రమంలో యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్వి శ్రీనివాస్, కమిటీ సభ్యులు ముచ్చపోతుల నరేష్, పర్సనబోయిన రాంబాబు, కట్ట హరిబాబు, బొమ్మకంటి లింగస్వామి, కొప్పుల సందీప్, థామస్, నాగరాజు, సురేష్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను వివరించాలి

మునుగోడు : దేశంలోని పేదరిక నిర్మూల కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్ కోరారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు సైనికుడిలా పనిచేయాలని సూచించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎరెడ్ల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు అఖిల్‌రెడ్డి, దర్శనం వేణుకుమార్, నాగరాజుగౌడ్, నరేందర్, ధనంజయ్య, యాదయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న భిక్షంగౌడ్

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం


నకిరేకల్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం


కేతేపల్లి : ఇనుపాములలో శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : పట్టణంలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి స్వామి వారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా జాగరణ నిమిత్తం విచ్చేసిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ పూజారి జిగురు లక్ష్మీనర్సింహామూర్తి, శివనారాయణశర్మ నేతృత్వంలో స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. జాగరణ నిమిత్తం ఆలయానికి వచ్చేసిన భక్తులకు షాద్‌నగర్ మళయాలస్వామి ఆశ్రమం పూజ్యశ్రీ శ్రీశ్రీ దయానంద స్వామి తన ప్రవచనాలను వినిపించారు. వేడుకల్లో ఆలయ చైర్మన్ ఉప్పల రమేష్, ధర్మకర్తలు కందాల ప్రవీణా రత్నారెడ్డి, చెన్న చంద్రశేఖర్, కొండ వెంకన్నగౌడ్, యాదగిరి, భక్తులు పాల్గొన్నారు.

కేతేపల్లి : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం శివపార్వతుల కల్యాణోత్సవాలను కనుల పండువగా నిర్వహించారు. మండలంలోని ఇనుపాములలో గల పచ్చలపార్వతీ సోమేశ్వరస్వామి దేవాలయం, భీమారం, కేతేపల్లిలోని శంభులింగేశ్వరస్వామి దేవాలయం, గుడివాడలోని రాజరాజేశ్వరి ఆలయంలో కల్యాణం నిర్వహించారు. ఇనుపాములలో స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు, భీమారంలో కాంగ్రెస్ నాయకుడు దైదా రవీందర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఇనుపాముల, భీమారం గ్రామాల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. వేడుకల్లో ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, ఆయా ఆలయ కమిటీ చైర్మన్లు అలుగుబెల్లి కేశవరెడ్డి, తిరుగుడు జితేందర్, ప్రతినిధులు అలుగుబెల్లి జోగిరెడ్డి, పగడాల గంగయ్య, చందా సైదులు, ఎ.శేఖర్, ఎస్‌కే.లతీఫ్, బత్తుల సంజీవరెడ్డి, జాల మాధవి, మాచర్ల రాము, రావిరాల సైదులు, నర్సింహ, సాయిబాబా, భక్తులు పాల్గొన్నారు.

పార్వతీ బండి రామలింగేశ్వరస్వామి కల్యాణం

కనగల్ : మండల కేంద్రంలోని పార్వతీ బండిరామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని శనివారం వేదపండితులు కనుల పండువగా నిర్వహించారు. కల్యాణతంతును ఆలయ ప్రధాన అర్చకుడు శంకర్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు నర్సింగ్ మురళీధర్‌గౌడ్ దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, తాజా మాజీ సర్పంచ్ నర్సింగ్ సునితాకృష్ణయ్యగౌడ్ దంపతులు కల్యాణం జరిపించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్, కౌన్సిలర్ మారగోని భవానీగణేశ్‌గౌడ్, చిట్ల లింగయ్య, నర్సింగ్ లక్ష్మయ్యగౌడ్, నీలకంఠం శేఖర్, నక్కల రమేష్, వేముల నరహరి, నక్క వెంకన్న, రాలయ శ్రవణ్ తదితరులున్నారు.

ఘనంగా కల్యాణ మహోత్సవం

మర్రిగూడ : మండల కేంద్రంలోని శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి కల్యాణ మహోత్సవం, శనివారం రుద్రహోమం నిర్వహించారు. అనంతరం బీఆర్‌ఎస్ మండల నాయకుడు చెరుకు శ్రీరాములు శోభ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. నేడు స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు లోక వెంకటశర్మ తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ కట్కూరి వెంకటేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ నల్ల యాదయ్య, రాపోలు యాదగిరి, గునగంటి యాదయ్యగౌడ్, పగడాల రఘు, వెంకటేష్, శ్రీనివాస్, ఆంజనేయులు, దినేష్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం : మండలంలోని శివాలయాల్లో పార్వతీ పరమేశ్వరుల దేవతామూర్తుల కల్యాణోత్సవాలు శుక్రవారం అర్ధరాత్రి కనుల పండువగా జరిగాయి. మండలంలోని చిత్తలూరులో గల శ్రీశాంభవి శంభులింగేశ్వర దేవాలయం, వల్లాలలోని శ్రీపార్వతీ శంభులింగేశ్వర దేవాలయం, భైరవునిబండలోని శ్రీగంగాభవానీ సమేత శ్రీఉమామహేశ్వర దేవాలయం, ఆకారంలోని చారిత్రాత్మక శివాలయంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లోని శివాలయాల్లో స్వామివార్ల కల్యాణోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ఉత్సవ నిర్వాహకులు, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరి కార్యక్రమం..

చిత్తలూరులోని శ్రీశాంభవిశంభులింగేశ్వర దేవాలయంలో జరిగిన పార్వతీ పరమేశ్వరుల దేవతామూర్తుల కల్యాణోత్సవంలో నిర్వహించిన భక్తి సంగీత కచేరి కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

శివాలయాల్లో అన్నదానం

మునుగోడు : మండలంలోని వివిధ గ్రామాల్లోని శివాలయాల్లో ఉత్సవ కమిటీలు, దాతల ఆధ్వర్యంలో శనివారం భక్తులకు అన్నదానం చేశారు. కోతులారం కేదారీశ్వర దేవాలయం, ఊకొండి శివాలయంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, అధికారులు ప్రారంభించగా, మునుగోడు శివరామ క్షేత్రాలయంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామాల ప్రజాప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్ మండల కేంద్రంలోని శివాలయంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రం, వివిధ గ్రామాలు ప్రజలు అన్నదానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


కనగల్ : కల్యాణంలో పాల్గొన్న మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ సునీత దంపతులు


మర్రిగూడ : రుద్ర హోమంలో పాల్గొన్న గ్రామస్తులు


శాలిగౌరారం : వల్లాలలో పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి


నల్లగొండ రూరల్ : అప్పాజీపేటలో ఎండిన వరిపంటను పరిశీలిస్తున్న నాయకులు

నల్లగొండ రూరల్ : ఎండిన వరిపంటలకు ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున అన్నారు. శనివారం మండలంలోని అప్పాజీపేట, కంచనపల్లి, అనంతారం, కొత్తపల్లి, జి.చెన్నారం గ్రామాల్లో ఎండిన పంటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. పంట దిగుబడికి వచ్చే సమయంలో భూగర్భజలాలు అడుగంటి వరిచేలు ఎండిపోతున్నాయని, ఎకరానికి రూ.10వేల నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలన్నారు. అదే విధంగా పండ్ల తోటల రైతులకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఆయన వెంట పార్టీ మండల నాయకులు సత్యనారాయణ, యాదయ్య, రామకృష్ణారెడ్డి, మల్లయ్య, రాములు, చిన్న, ముత్యాలు ఉన్నారు.

కనగల్ : ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు పాలడుగు ప్రభావతి అన్నారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో ఎండిన వరిపంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంటలను సాగు చేశారని తీరా పైరుకు నీరు లేక ఎండిపోవడంతో తీవ్రంగా నష్టపోయారని అన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. 20రోజుల ముందుగా శ్రీశైలం నీటిని విడుదల చేసి ఉంటే ఒక ఎకరా ఎండిపోయే పరిస్థితి ఉండేదికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గ్రామంలో ఎండిన పంటలను అంచనా వేసి ఎకరానికి రూ.20వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట పార్టీ మండల కార్యదర్శి కందుల సైదులు, మండల కమిటీ సభ్యులు కానుగు లింగస్వామి, ఎండీ అక్రమ్‌సుల్తానా, అంజిబాబు తదితరులు ఉన్నారు.

మారోజు చంద్రమౌళి ప్రథమ వర్ధంతి


నకిరేకల్ : నివాళులర్పిస్తున్న నాయకులు

నకిరేకల్ : పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం మారోజు చంద్రమౌళి ప్రథమ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చినవెంకులు, మాజీ ఎంపీపీ మర్రి వెంకటయ్య, వంటిపాక కృష్ణ, సాకుంట్ల నర్సింహ, ఆదిమల్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

శాలిగౌరారం : మండల కేంద్రంలో సీపీఎం నాయకుడు మారోజు చంద్రమౌళి ప్రథమ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి చలకాని మల్లయ్య, నాయకులు మక్క బుచ్చిరాములు, జగన్, కల్లూరి లింగయ్య, డెంకల లింగయ్య, అవనిజ, రామచంద్రు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

కనగల్ : మండల పరిధిలోని రేగట్ట గ్రామంలో ఈనెల 18నుంచి 21వరకు నిర్వహించే శ్రీభవానీ శంకరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం స్థానికంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పుష్పలతవెంకటేశం, ఆలయ చైర్మన్ గంజి చంద్రమౌళి, కార్యదర్శి దొమ్మాటి అంజయ్య, కోశాధికారి కర్నాటి శ్రీనివాసులు, మాజీ ఉప సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ, ఎర్రోళ్ల ఎల్లయ్య, దొమ్మాటి కొండయ్య, పులకరం ఎల్లప్ప, తిరందాస్ రామలింగం, మార్గం లింగయ్య, శివార్ల పర్వతాలు, భోగరాజు వెంకటేశం, మేర పిచ్చయ్య, కర్ణం యాదగిరి, వై.కోటేష్ పాల్గొన్నారు.

రవన్న చిత్రపటానికి నివాళి

నకిరేకల్ : పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాయల సుబాష్ చంద్రబోస్ (రవన్న) 8వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకుడు అంబటి చిరంజీవి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మామీడోజు వెంకటేశ్వర్లు, సోమయ్య, సైదులు, అనిల్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నకిరేకల్ : మండలంలోని నోముల గ్రామానికి చెందిన బొంత శేఖర్ (35) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడు నిరుపేద కావడంతో వడ్డెర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దండుగల సైదులు రూ.10వేలు, మాజీ సర్పంచ్ కుంచం రమణమ్మ సోమయ్య రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ, ఇరుగుదిండ్ల అంజయ్య, ఆలకుంట్ల ఉపేందర్, తమ్మిశెట్టి రాజేష్, లక్ష్మణ్, శేఖర్ ఉన్నారు.